# వసుంధర కోపం

## అను కనకరాజు వ్రత కథ



రచన వసుంధర

ఉపోద్ఘాతము:

ఊర్ధ్వలోకాల మహిళామండలి సమావేశమైంది. అందులో త్రిమూర్తుల భార్యలగు లక్ష్మి, పార్వతి, సరస్వతులూ, పతివ్రతా శిరోమణులుగా పేరెన్నికగన్న అనసూయ, అరుంధతి, సుమతి మొదలగువారు కూడా ఉన్నారు. ఆ సభకు మగవారి ప్రవేశం నిషేధం—అందువల్ల వారంతా విచ్చల విడిగా తోచిన విషయాలమీద చర్చలు చేయడం మొదలుపెట్టారు. అనేక రకాల చర్చల అనంతరం అందరికీ కూడా ఒకే ఒక సందేహం కలిగింది.

భూలోకంలో ప్రస్తుతం కలియుగం నడుస్తోంది. మానవుల్లో పాపభీతి కానీ దైవభక్తిగానీ మచ్చుకు్కూడా కనిపించడం లేదని చెప్పుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో—ఇతర యుగాల్లో స్త్రీ జాతికి ఎంతో కీర్తి తెచ్చిపెట్టిన పాతివ్రత్య ధర్మం ఇంకా మానవుల్లో పాటించబడుతోందా అన్నదే వారి సందేహం.

చాలామంది అసంభవం అన్నారు. కొంతమంది—"చెప్పడం కష్టం!" అన్నారు. అందరూ తలోమాటా ఆడుతూండగా-"ఎంత పాపభీతిలేకున్నా మానవులు రాక్షసులకంటె దుర్మార్గులు కారు. రాక్షస స్త్రీలైన మండోదరి, సులోచన పాతివ్రత్య ధర్మాన్ని పాటించ గలిగినపుడు మానవస్త్రీలలో పతివ్రతలుండరంటే నేను నమ్మలేను" అంది సరస్వతి.

సరిగ్గా అదే సమయానికి ఒక ద్వారపాలకురాలు వచ్చి—"మహర్షి నారదులు ప్రవేశానికి అనుమతి వేడుకుంటున్నారు," అంది.

సభాధ్యక్షురాలు లక్ష్మీదేవి ఒక్క నిముషం ఆలోచించి—"నారదుడు త్రిలోక సంచారి. మన సందేహం ఆయన తప్పక తీర్చగలడు. కాబట్టి ఈ రోజుకి ఆయనకు ప్రత్యేక అనుమతి నిద్దాం!" అంది. అంతా వెంటనే తలలూపారు అంగీకార సూచకంగా.

"నారాయణ!" అంటూ నారదుడు ప్రవేశించాడు.

"ఏమి నారదా—ఏమివిశేషాలు?—"అంది లక్ష్మీదేవి.

"మీకు తెలియని వేమున్నవమ్మా—మీ మహిళాసభ నొక్కసారి కనుల పండువగా చూడాలనిపించి వచ్చాను. చూశాను? కన్నుల పండువయింది. అనుమతిస్తే సెలవు తీసుకుంటాను."

"ఆగు నారదా!" అంది పార్వతి-"మేమందరమూ నీ ద్వారా ప్రస్తుత భూలోక స్త్రీల పాతివ్రత్య ధర్మాచరణ గురించి తెలుసుకుందామనుకుంటున్నాము."

నారదు డోసారి సభంతా కలయ జూసి మందహాసం చేశాడు. "భూలోకంలో - అందులోనూ కర్మభూమియైన భారతదేశంలో పాతివ్రత్య ధర్మాచరణకు లోటేమిటమ్మా—అది కొనసాగుతూనే ఉంది- ఉంటుంది కూడా-" అన్నాడు.

"నాకు నమ్మకం లేదు!" అంది చంద్రుని భార్య శచీదేవి.

నారదుని ముఖం గంభీరంగా అయిపోయింది. "స్వయంగా చూశాను నేను. భూలోకంలో పాతివ్రత్య ధర్మం పూర్వం కంటె చక్కగా పాటించబడుతోంది. నిజానికి ఈ కలియుగపు సతీపతులను చూస్తుంటే నాకు ముచ్చటేసింది కూడా. పూర్వపు స్త్రీలు ఎప్పుడూ పూజలూ, వ్రతాలూ తప్పితే ఎప్పుడైనా ప్రేమ ననుభవించి ఎరుగుదురా ఏమన్నానా?" ఓసారి సభ వంక కలయజూసి మళ్ళీ అన్నాడు నారదుడు:

"ఇప్పటి సతికి వ్రతాలతోటీ దేవుడితోటీ సంబంధం లేదు. ఆమెకు దేవుడు భర్త. ఆమె తపస్సు ప్రేమ. ఆ తపోబలంతో పతిని సర్వదా తమ విధేయుడిగా ఉంచుకుంటుందామె. తను విధేయతతో మసలుతుంది. పతిని విధేయుడిగా చేసుకోలేని పూర్వకాలపు పాతి



వ్రత్యం సారవిహీనం కదూ? అందువల్లనే ఈ కలియుగ పతివ్రతలు ఇతర యుగాల్లో ఏ పతివ్రతలూ ఎన్నడూ ఊహించని ఒక కొత్త శక్తిని కూడా కలిగివున్నారు-"

నారదుడు మళ్ళీ ఆగాడు. సభలో గుసగుసలు రేగాయి. కొంతమంది ముఖాలు ఎర్రబడడం కూడా జరిగింది. ఆఖరికి శచీదేవి— "నేను నమ్మలేను" అనేసింది.

వెంటనే నారదుడు ప్రశ్నించాడు-"అయితే మీ పాతివ్రత్య ప్రభావంతో మీ భర్తను శపించగలరా?"

ఒక్కసారిగా సభంతా నిశ్శబ్దంతో నిండిపోయింది.

"ఇంకో కొద్ది క్షణాల్లో ఒక కలియుగ పతివ్రత తన భర్తను శపించబోతోంది. మీలో నమ్మకం లేనివాళ్ళు, కుతూహలం ఉన్నవాళ్ళు ఎవరైనా ఉంటే చూడవచ్చు" అన్నాడు నారదుడు.

"ఎవరామె?" అనడిగింది అనసూయ ఆందోళిత వదనంతో. స్త్రీ తన భర్తను శపించడం ఆమెకు చాలా ఆవేదన కలిగించినట్లు ఆమె ముఖం చూస్తుంటేనే తెలుస్తుంది.

"ఆమెపేరు వసుంధర........ అదిగో చూడండి-అది విశాఖపట్టణ నగరం. ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంతం......ఆ ప్రాంతంలో చిరాగ్గా....విసురుగా నడుస్తున్న వ్యక్తి పేరు రాజారావు....అతడే వసుంధర భర్త....చూడండి...."

దేవతా స్త్రీ లందరూ తమ దివ్యచక్షువులతో నారదుడు చూపించిన పరిసరాలను తిలకించ సాగారు.

వసుంధర శాపం :

రాజారావుకి కోపం విపరీతంగా వచ్చేస్తోంది. అందుకు చాలా కారణాలున్నాయి. రోజూ తొమ్మిది గంటలకే భోంచేసి లాబొరేటరీకి వెళ్ళడం అతనికి అలవాటు. కానీ వంట ఆలస్యం కావడంవల్ల భోజనం చేయకుండానే లాబొరేటరీకి వెళ్ళాడు. అక్కడ అతని అజాగ్రత్తవల్ల ఓ క్షమించరానినేరం జరిగి ప్రొఫెసరుగారు అతనిమీద మండిపడ్డారు. మనసు పాడయిన రాజారావు పన్నెండు గంటలకి భోజనానికని ఇంటికి బయల్దేరాడు. వేసవి కాలమేమో సూర్యుడు మండిపడుతున్నాడు. రాజారావు కడుపు ఆకలితో మండిపోతోంది.

ఇంటికి చేరుకున్న రాజారావు ఆట్టే ఆలశ్యంచేయకుండానే భోజనానికి కూర్చున్నాడు. అయితే ఆ రోజు అన్నం చిమిడిపోయింది, పప్పు మాడిపోయింది, కూరలో ఉప్పు దారుణంగా ఎక్కువైంది, పులుసు మరీ పుల్లగా ఉంది.

కొన్ని రసాయనిక పదార్థాలకి "ఫాస్ఫారిసెన్స్" అని ఒక ధర్మం ఉంటుంది. ఆ పదార్థాలు ఎండలోని కాంతి తరంగాల్ని గ్రహించుకుని చీకటిలో మళ్ళీ ఆ కాంతి తరంగాల్ని వింత వింత రంగుల్లో విడుదల చేస్తుంటాయి. ఈ రకం పదార్థాలనే రేడియం డయల్ గడియారాలకు ఉపయోగిస్తుంటారు కూడా. రాజారావు తన రీసెర్చిలో అటువంటి "ఫాస్ఫారిసెంట్" పదార్థాలను రెండింటిని తయారు చేశాడేమో, అతనికీ కొద్దిగా ఆ లక్షణాలు అలవడ్డాయి. ఫలితంగా అతను—తను గ్రహించిన ప్రొఫెసరుగారి తిట్ల వేడికాంతినీ, సూర్యుడి మండుటెండ కాంతినీ, ఆకలి మంట కాంతినీ-వింత రంగుల్లో భార్యమీద ప్రసరించాడు. మామూలు మాటల్లో చెబితే—అతను భార్యమీద మండి పడ్డాడనే చెప్పాలి.

"ఛాఛా-ప్రపంచంలో ఎవ్వరూ ఇంతకంటే చచ్చురకంగా వండలేరు!" అన్నాడు ఆఖరిసారిగా - దులపవలసినవన్నీ దులిపేశాక.

చాలాసేపు సహనంతో విన్న వసుంధర ఈ ఆఖరి మాటకు చాలా బాధపడింది. "మీ రిదివరకు క్యారియర్ భోజనం చేసేవారు గదా- ఆ భోజనం కంటే తీసిపోయిందా ఇది!" అంది.

తను వివాహాత్పూర్వం మూడేళ్ళు క్యారియర్ భోజనం చేసినట్లు రాజారావు మరచిపోలేదు. వాడి భోజనం బాగుండదని అతనెవరి దగ్గరైనా ఒప్పుకుంటాడుగానీ వసుంధర దగ్గర మాత్రం ఒప్పుకోడు. "వాడికేం-మూడేళ్ళు లక్షణంగా పెట్టాడు. వచ్చావు మహాతల్లివి-తిండికి మొహం వాచిపోయాను-" అన్నాడు రాజారావు.

"మజ్జిగైనా మరోసారి కలుపుకోండి—బొత్తిగా అన్నం తినలేదు-" అంది బాధపడుతూ వసుంధర. ఆ మాటలు అతని కోపాన్ని మరింత రెచ్చగొట్టాయి-"ఛీ-" అంటూ అందులోనే చెయ్యి కడిగేసుకున్నాడు.

ఏం మాటాడాలో వసుంధరకు తోచలేదు. భర్త ఇంతగా కోపగించుకోవడం ఆమె ఏడాది అనుభవంలో ఆమె ఎన్నడూ ఎరుగదు.

చెయ్యికడుక్కున్న వెంటనే బట్టలు వేసుకో సాగాడు రాజారావు. "అప్పుడే వెళ్ళిపోతారా? కాస్సేపు నడుం వాల్చి...."

"వెళ్ళాలి!" తీవ్రంగా అన్నాడు రాజారావు.

"అయిదింటికల్లా వచ్చేస్తారు కదూ?"

"రాను!"

"ఎన్ని గంటల కొస్తారు?"

"నీ కంటె దరిద్రంగా వంటచేసే వాళ్ళు కనిపించినప్పుడు!"


ఈసారి వసుంధరకు కళ్ళనీళ్ళపర్యంతమై, కోపంకూడా వచ్చింది - "ఎందుకండీ - ఒక్కపూట జరిగిన పొరబాటు కింత సాధిస్తారు - నా కంటే దరిద్రంగా వండే వాళ్ళవంట నెలల తరబడీ తినేరోజు నిజంగానే వస్తుంది లెండి-" అంది.

ఆలుమగల కలహం అద్దంమీద ఆవగింజలాంటిదన్న సత్యం ఋజువై వాళ్ళు కొద్ది గంటలలోనే మరిచి పోయినప్పటికీ వసుంధర వ్యథాపూరిత మనస్కురాలై ఇచ్చిన శాపం పనిచేయక మానుతుందా? అతనిచేత శాపాన్ని అనుభవింప జేయడం కోసం ఒకతను పుట్టి పెరుగుతున్నాడు. అతని పేరే కనకరాజు.

కనకరాజు వివరములు:

విజయనగరానికి దగ్గర్లో ఉన్న ఓ కుగ్రామంలో కనకరాజు అనబడే ఒక అమాయక ప్రాణి నివసిస్తున్నాడు. అతను వెర్రిబాగుల వాడిగా ఊళ్ళో ప్రసిద్ధి చెందాడు. ఊళ్ళో అందరికీ ఈపనీ, ఆ పనీ చేస్తూ-వాళ్ళు పెట్టింది తిని బ్రతుకుతూండేవాడు.

వసుంధర శాపానికి సరిగ్గా నాలుగేళ్ళ క్రితం యమధర్మరాజూ, శనిదేవుడూ, విశ్వామిత్రుడూ కలిసి తమ అంశల్ని కొద్ది కొద్దిగా ఈ కనకరాజులోనే ప్రవేశ పెట్టారు. అదే రోజున కనకరాజుకి చిన్న హోటల్ ఒకటి పెట్టాలని బుద్ధి పుట్టింది. అందుక్కావలసిన వందరూపాయలూ ఊళ్ళో నలుగుర్నీ అడిగి అప్పుగా తెచ్చుకుందామని అనుకున్నాడతను. అటు




వంటి ప్రయత్నాల్లోనే అతను ప్రకాశం కళ్ళబడ్డాడు.

ప్రకాశం భువనేశ్వర్లో రీజనల్ రీసెర్చి లేబొరేటరీలో ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ సరయిన భోజన సదుపాయం లేనందున ఓ పదిపదిహేనుమంది తెలుగు ఉద్యోగస్తులు కలిసి మెస్సు పెట్టుకుందా మనుకున్నారు. అందు గురించి వాళ్ళకొక వంటవాడు కావలసివచ్చాడు. ఆ భారం ప్రకాశం తనమీద వేసుకున్నాడు. కానయితే తెలిసి తెలిసి భువనేశ్వర్ లాంటి ఊరికి రావడానికి ఎవరూ అంగీకరించడంలేదు. అటువంటి సమయంలో ప్రకాశాన్ని హోటలు పెట్టుబడి కోసం కనకరాజు కలుసుకున్నాడు.

ప్రకాశం తన పరిస్థితి వివరించి—"వంట చేయడానికి భువనేశ్వర్ వస్తావా?" అనడిగాడు.

వంట చేయాలని ఉబలాట పడిపోతున్నాడు కనకరాజు. అతనికి ప్రకాశం చెప్పిన షరతులూ అవీ నచ్చాయి. వెంటనే ప్రకాశంతో భువనేశ్వర్ వెళ్ళిపోయాడు.

ఇది జరిగి నాలుగున్నర సంవత్సరాలు గడిచిన అనంతరం రాజారావుకి భువనేశ్వర్లో రీజనల్ రీసెర్చి లేబొరేటరీలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగమయితే వచ్చింది కానీ అతనికి క్వార్టరు దొరకలేదు. హాస్టలు కూడా ఖాళీ లేదు. ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాయంవల్ల ఒక పంజాబీ అతను రాజారావు తనతోపాటు హాస్టల్ సూట్ లో ఉండడానికి అంగీకరించాడు. వసుంధరను ఎడబాసిన రాజారావుకు కనకరాజు మెస్సులో జేరడం తప్పని సరయింది.

కనకరాజుని చూసి రాజారావు గ్రహించిన విషయములు :

కనకరాజు నల్లనివాడు. పద్మనయనాలు లేవు. లావుగా, బలంగా ఉంటాడు. నువ్వు బలంగా ఉండడానికి కారణ మేమిటని అడిగితే తను చేసిన వంట తినకపోవడమేనని అంటూంటాడు. అతన్ని గురించి హాస్టల్లో బ్రహ్మచారులందరూ రకరకాల కథలు చెప్పుకుంటూంటారు.

కనకరాజు అంటే కాలనీలో కాపురం చేసుకుంటున్న ఆడవాళ్ళందరికీ ఎంతో అభిమానం. కనకరాజు నెమ్మదిగా భువనేశ్వర్లో స్థిరపడి కొన్ని ఆవులు కొన్నాడు. తెలుగు ఆడవాళ్ళందరూ కనకరాజు దగ్గరే పాలు పోయించుకునేవారు; కనకరాజు పాలు బాగా పోస్తాడనికాదు- అతని వ్యాపారం బాగా అభివృద్ధి పొంది నాలుగు కాలాలపాటు భువనేశ్వర్లో ఉంటాడని.

వాళ్ళు కనకరాజు అభివృద్ధిని కాంక్షించడంలో ఒకే ఒక స్వార్థపూరితమైన కాంక్ష ఉంది. వాళ్ళ భర్తలందరూ కనకరాజు భోజనం రుచి చూడడంవల్లనే-ఇంట్లో మారు మాటాడకుండా భోంచేసేస్తూంటారు. ఎలా వండినా బాగానే ఉందని మెచ్చుకుంటూంటారు. ఎప్పు

దైనా కోపమొచ్చి పుట్టింటికి పోతామని బెదిరించినా-కనకరాజు గుర్తుకురాగా- "పోతేపో!" అనకుండా బ్రతిమాలుతూంటారు. ఇదంతా కనకరాజు చలవే!

కనకరాజు మెస్సులో భోంచేసిన సుబ్బారావు అనే అతను-అంతకాలం పెళ్ళి ఒద్దంటూండేవాడు-పెళ్ళి చూపులు కూడా అక్కర్లేకుండా-ఎవరో ఒక అమ్మాయిని స్థిరపరిచేయమని తలిదండ్రులకు ఉత్తరం రాశాడు. సుబ్బారావుకి తమ మీద గల భక్తి ప్రపత్తుల కతని తలిదండ్రు లానందపరవశులై పోయారు కూడా. ఇంతేకాదు. కనకరాజు సాధించిన అద్భుత ఫలితాలు ఇంకా ఉన్నాయి.

వేమనశతకం లోని అనగననగరాగమతిశయిల్లుచునుండు అన్న పద్యం అర్థం లేనిదని కనకరాజు మెస్సులోని వారందరూ గ్రహించారు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్న వేమన వాక్యం నిజమైతే-నాలుగైదేళ్ళుగా వంట చేస్తున్నా కనకరాజు ప్రావీణ్యతలో ఏమీ మార్పులు లేకబోవడమూ, అతనిలో అభివృద్ధి కానరాకపోవడమూ ఎలా జరుగుతుంది? అదీ కాక-'తినగ తినగ వేము తీయనగును' అన్నాడు వేమన. కాని కనకరాజు భోజనం ఏళ్ళతరబడి తింటున్నా తీపిమాట దేవు డెరుగు-అసలు రుచి అనేదే తెలియదు గదా!

అయితే రాజారావూ, ఇంకా అనేకమంది-అతని మెస్సులో ఎలా భోంచేస్తున్నారని కొంతమందికి సందేహం రావచ్చు. వారందరికీ ఒకే ఒక సమాధానం. అదే వాళ్ళంతా శాపగ్రస్తులన్నది.

ఒకసారి "అనగననగ రాగమతిశయిల్లుచునుండు" అన్న పద్యంమీద చర్చ వచ్చి కనకరాజు పట్ల ఆ పద్యం వర్తించని కారణంగా ఒకతను వేమనను నిందించ సాగాడు. కనకరాజు భోజనం అనుభవంలోకి రాని వేమన అనుభవం ఈ పద్యానికి చాలలేదనీ - అటువంటి అనుభవరహితుడైన కవి గొప్పవా డెలా అవుతాడనీ, అతనసేసరికి రాజారావుకి మనసు కొంచెం చివుక్కుమంది. అప్పు డతను వేమనను సమర్థిస్తూ చెప్పిన వాక్యాల సారాంశమిది.

కనకరాజు సామాన్య మానవుడు కాడు. అతడు దైవాంశ సంభూతుడు. బహుశా అతని మెస్సులోని సభ్యులందరూ భూలోక నరకం అనుభవించవలసినదిగా శపించబడి ఉండి ఉండాలి. అటువంటి శాపగ్రస్తుల శాపాన్ని అనుభవింపజేయడానికి అవతరించిన కారణ జన్ముడు. వారి శాపంతీరేదాకా అతని అవతారముంటుంది. ప్రస్తుతం భోజనరూపేణా అతను చేస్తున్నవన్నీ లీలలు. వేమన పద్యం సామాన్య మానవులకు తప్పక వర్తిస్తుంది కానీ-కనకరాజుకి మాత్రం వర్తించదు.

కనకరాజు లీలలు :

ఒకరోజు సాయంత్రం నాలుగున్నరకు ఆఫీసు వదలగానే కనకరాజు మెస్సు మెంబర్లు పన్నెండుగురూ టిఫిన్ కోసం మామూలుగా వెళ్ళారు. వాళ్ళు వెళ్ళేసరికి అందరికీ ప్లేట్లలో గారెలు వడ్డించబడున్నాయి.

సభ్యులందరూ ఉత్సాహంగా ప్లేట్ల ముందు కూర్చున్నారు. అప్పుడు కనకరాజు గర్వంగా నుంచుని వాళ్ళందరి కేసీ చూస్తూ- "ఈ వేళ గారెలు స్పెషల్‌గా చేశాను. తేడా చెప్పుకోవాలి!" అన్నాడు. వెంటనే రాజారావు ఓగారెను తీసుకుని నోట్లో పెట్టుకుని సుతారంగా నమల బోయాడు.

గరగరమని చప్పుడైంది. అంతేకాదు. అదే సమయంలో డైనింగు హాలంతా గరగర శబ్దంతో నిండిపోయింది! అందరూ ఒక్కసారిగా గారెను నమలడానికి చేసిన ప్రయత్నం వల్ల ఆ చప్పుడైనట్లు అందరూ గ్రహించడానికి ఎంతోసేపు పట్టలేదు. అయితే ఎలా? ఆ గరగర శబ్దం గారెయొక్క విపరీతమైన గట్టిదనం వల్ల కలిగింది. దాంతో-గారె పంటికి లొంగబోవడం లేదనే విషయం అందరికీ తెలిసిపోయింది.

ఒక్క నిముషం ఆలోచించి రాజారావు తన ప్లేటుని తీసి గారెని గట్టిగా కొట్టాడు. ప్లేటు రెండు ముక్కలై పోయింది. మిగతా వాళ్ళు వెంటనే ఆ ప్రయత్నం లాభం లేదన్నారు.

గోల్డ్ ఫింగర్ అనుచరుణ్ణి మించి బలంగా ఉంది ఆ గారె.

కనకరాజు ఇంకా గర్వంగా అందరికేసీ చూస్తూనే ఉన్నాడు. కానీ ఎవరూ కనకరాజు వంక చూడడంలేదు. వాళ్ళందరికీ పౌరుషం వచ్చింది. నిండు యవ్వనంలో ఉన్న తాము-ఆఫ్టరాల్-ఒక గారెని పగలగొట్ట లేకపోవడం ఎంత అవమానం?

"కనకరాజూ, రుబ్బురోలు పొత్రం పట్టుకూరా!" అన్నాడు భాస్కర్రావనే ఓ సభ్యుడు. కనకరాజు వెంటనే ఆ వస్తువుతో హాజరయాడు.

భాస్కర్రావు మంత్రం పనిచేసింది. గారె రెండుగా బద్దలయింది. అప్పుడే అందరూ ఒక ఉత్సాహకరమైన విశేషాన్ని కనిపెట్టారు. గారె పైన ఎంత గట్టిగా ఉన్నప్పటికీ లోపల మెత్తగానే ఉంది. పగిలిన ఆ ముక్కలోపలి మెత్తని గుంజును స్పూనుతో తీసుకు తినసాగాడు భాస్కర్రావు, శివ ధనుర్భంగం గావించిన రాముడి పోజునిస్తూ.

అప్పటికి అందరూ శారీరకంగానూ. మానసికంగానూ అలసిపోయారేమో-అందరికీ చాలా ఆకలిగా ఉంది. పొత్రంతో బద్దలుకొట్టి-గారె లోపలి గుంజుని అంతా వేగంగా తినసాగారు. ఆ గుంజు నిజంగానే రుచిగా ఉంది.

కొత్తరకం టిఫిన్‌చేసిన కనకరాజుని అంతా మెచ్చుకున్నారు. కనకరాజు అందరి వంకా మరింత గర్వంగా చూసి-"రేపు కొత్త రకం దోసెలు వేయబోతున్నానండి!" అన్నాడు. అంతా హడిలిపోయారు. "వద్దు-వద్దు!" అన్నారు ఏక కంఠంతో. సరేనని కనకరాజు అభయమిచ్చేదాకా వాళ్ళకు మనఃస్థిమితం లేదు.

ఆకలితో, నకనకలాడుతున్న కడుపుల్తో-ఆత్రంగా టిఫిన్ తిన్న ఆ సభ్యులందరికీ కూడా మర్నాటికి అజీర్ణం పట్టుకుంది. అందుకని వాళ్ళు కనకరాజుని ఆ రోజుకు కంది పప్పు వండొద్దని చెప్పారు. అలాగే నన్నాడు కనకరాజు. కానీ తీరా భోజనం టైముకు బల్ల దగ్గరకొచ్చి చూస్తే పప్పు కూడా కనిపించింది కూరతోపాటు.

సభ్యులందరికీ చాలా కోపం వచ్చేసింది- "ఏమయ్యా కనకరాజూ- వద్దంటే పప్పెందుకు చేశావ్?" అంటూ గద్దించారు.

కనకరాజు ముసిముసిగా నవ్వాడు. "ఏంటి బాబూ, నాతో వేళాకోళమాడతారు? అది పప్పు కాదు కూరే!" అన్నాడు.

"మరయితే ఆ రెండో దేమిటి?"

"అదీ కూరే- పప్పొద్దన్నారు గదాని ఈ రోజుకి కూరలు రెండు చేశాను."

"ఓహో-ఇంతకూ ఏం కూరలవి?"

"ఆనపకాయ, వంకాయ...."

రాజారావు ఆశ్చర్యంగా చూశాడు. ఆనపకాయగానీ, వంకాయగానీ కూరగా వండబడినప్పుడు—ఆ కూర ఎన్నడూ కూడా పప్పులా కనిపించదు. మరి వీటిల్లో ఓ కూర చూడ్డానికి అచ్చం పప్పులాగా వుంది. వెంటనే రాజారావుకో ఐడియా వచ్చింది. "కనకరాజూ- నీకో చిన్న పరీక్ష! ఈ రెండు కూరల్లో ఏది ఏదో నువ్వు చెప్పుకోవాలి!" అన్నాడు.

"ఓస్-దానికేముంది—ఆ పచ్చగా ఉన్నదేమో ఆనపకాయ"—

"ఆగవయ్యా బాబూ-అలాక్కాదు. నువ్వు కళ్ళు మూసుకో—నోరు తెరుచుకో. నేను నీ నోట్లో ఒక కూర వేస్తాను. రుచిని బట్టి అప్పుడు చెప్పుకోవాలి—"

కనకరాజు వెంటనే ధీమాగా కళ్ళు మూసుకుని నోరు తెరిచాడు. రాజారావు ఇంత నల్లటి కూరని తీస్కుని కనకరాజు నోట్లో వేశాడు. కనకరాజు నోరు చప్పరించి హఠాత్తుగా కెవ్వుమని అరిచాడు.

అందరూ ఉలిక్కిపడ్డారు.

"ఈ రోజు కూర బాగా లేదండి- అది మాత్రం తినకండి. పాపిష్టోణ్ణి కూర పాడు చేశాను—" అంటూ నోరు కడుక్కుందుకు పరుగెత్తుకుంటూ పోయాడు కనకరాజు.

అప్పుడప్పుడు తన వంటని తిడుతూండడం కనకరాజుకి మామూలే—అటువంటి సందర్భంలో సభ్యులందరికీ అతని మీద జాలేస్తూంటుంది. పశ్చాత్తాప పడేవాణ్ణి ఎవరైనా సులువుగా క్షమించేస్తారు గదా!



అయితే రాజారావు కిది ఊహించని పరిణామం. కనకరాజు కూర చెప్పుకోలేకపోతే తమాషాగా నవ్వుకోవచ్చు ననుకున్నాడు. కానీ కథ అడ్డం తిరిగింది. ఇప్పుడా రెండో కూర ముట్టుకోడానికి అంతా భయపడ్డారు.

"అయితే యిక్కణ్ణించి - ముందుగా ఎవరైనా రుచి చూస్తేనే గానీ-వంటకాలు మనం ముట్టుకోరాదు." అన్నాడు నారాయణ అనబడే ఓ సభ్యుడు.

"పూర్వకాలం రాజులు అలానే చేసేవారు" అన్నాడు భాస్కర్రావు.

ఇంతలో కనకరాజు తిరిగి వచ్చాడు. అతన్ని చూస్తూనే సుందరం అనబడే ఓ సభ్యుడు అడిగాడు పసుపుపచ్చ రంగు కూరను చూపిస్తూ"—ఏమయ్యా, ఈ కూరైనా తినేలాగుంటుందా?"

ఆ ప్రశ్న వింటూనే కనకరాజు పకపకా నవ్వ నారంభించాడు. అందరూ విస్తుబోయి చూస్తూండగా నవ్వు నాపి—రాజారావు వంక తిరిగి "ఇందాకా నా నోట్లో మీరు వేసినది—వంకాయ కూరండీ!" అన్నాడు.

రాజారావుకీ, మిగతా సభ్యులకీ కూడా పరిస్థితి అర్థంకాలేదు.


కనకరాజే మళ్ళీ నవ్వి అన్నాడు: "నేను కూర తప్పు చెబితే ఆక్షేపిస్తారని భయమేసింది నాకు. అందుకని అలా నాటక మాడాను. ఇప్పుడు నా నోట్లో వేయని కూరేదో సుందరం గారు చూపించేరా—దాంతో నా నోట్లో వేసిందేదో తెలుసుకున్నాను. కూరల గురించి మీకేం భయంలేదు — రెండూ భేష్టుగా కుదిరాయిలెండి—"

పైకి చిరాకు ప్రదర్శించినా కనకరాజు తెలివి తేటల్ని మనసులోనైనా అభినందించుకోకుండా ఉండలేకపోయారు సభ్యులు. ఎందుకంటే అతని కూరల్ని గుర్తుపట్టడానికి అంతకుమించి మరో దారిలేదు.

అయితే మర్నాడే కనకరాజు మెస్సు మెంబర్సుకు-కౌంటర్ టెస్టు పెట్టాడు.

"నిన్న మీరు నన్నడిగేరు కదా—ఈ వేళ నేను మిమ్మల్నడుగుతున్నాను—కూరేంటో చెప్పుకోవాలి" అన్నాడు గంభీరంగా.

ఐన్‌స్టీన్ లెక్కలేనా అర్థమవుతాయిగానీ, కనకరాజు కూరలు ఏమిటో తెలుసుకోవడం వల్ల కాదని సభ్యులందరికీ తెలుసు. అయినా యథాశక్తి ప్రయత్నించి చూతామని చూశారు. రుచినిబట్టి ఏమీ తెలియలేదు కానీ-ఆకారాన్ని బట్టి వంకాయలా ఉండడంవల్ల—"వంకాయ




కూర!'' అని అందరూ అన్నారు ఒక్క రమణరావు తప్ప.

రమణరావు మాత్రం-''ఇది ఏ కూరైనా కావచ్చు గానీ—వంకాయ మాత్రం కాదు-ఖచ్చితంగా చెప్పగలను'' అన్నాడు.

కనకరాజు ముఖంలో ఆశ్చర్యం కనిపించింది—''నిజమేనండీ - కానీ కాదని ఎలా కనుక్కోగలిగారు?'' అనడిగాడు.

అందరూ రమణరావు వంక గౌరవ భావంతో చూశారు. కనకరాజు వండిన కూర-ఫలానాది కాదని ఖచ్చితంగా చెప్పగల సాహసమూ, సామర్థ్యమూ అతనెలా సంపాదించాడో-వాళ్ళెవరికీ అర్థంకాలేదు. భేతాళ ప్రశ్నకు జవాబిచ్చిన విక్రమార్కుడి ఫోజులో రమణరావు చెప్పాడు—''నిన్న సూర్యనారాయణ గారింటి కెళ్ళాను. మాటల సందర్భంలో ఆయన భార్య-నిన్న మార్కెట్‌లో వంకాయ ఎక్కడా దొరకలేదని చెప్పేరు. మన మెస్సులో వంకాయలు నిన్న ఉదయంతోనే అయిపోయాయి గదా-రెండు రెళ్ళు నాలుగు-అదే చెప్పాను.''

''కెమిస్ట్రీలో ఏ రాడికల్ నయినా ఈజీగా ఐడెంటిఫై చేయగలను—కానీ జీవితంలో కనకరాజు వద్ద పెయిలై పోయాను'' అనుకున్నాడు కెమిస్ట్రీ పీహెచ్ డీ రాజారావు.

కనకరాజు నిజంగానే రీసెర్చి లేబొరేటరీ మెస్సుకి వంట వాడిగా ఉండవలసినవాడు. ఎందుకంటే అతను వంటలో నిత్యం రీసెర్చి చేస్తూంటాడు. ఆ రీసెర్చిలో నిత్యమూ కొత్త కొత్త వంటకాలను తయారు చేస్తూండేవాడు.

తెలుగు సినిమాల్లో మార్పు లేదనీ, అన్నీ ఒకేరకంగా ఉంటున్నాయనీ చాలామంది ప్రేక్షకులు బాధపడుతున్నారు. కొంతమంది రచయిత్రులు ఎన్ని నవలలు రాసినా అన్నీ ఒకే రకంగా ఉంటున్నాయనీ—మార్పు తెలియడం లేదనీ కొంతమంది పాఠకులు బాధపడుతున్నారు. అదే నిజమైతే తెలుగు సినిమా నిర్మాతలూ, ఆ రచయిత్రులూ కనకరాజుని చూసి నేర్చుకోవలసింది చాలా ఉంది. ఎందుకంటే మార్పుకి మారుపేరే కనకరాజు.

కనకరాజు ఇప్పటికి ఒక పులుసుగానీ, కూరగానీ, పప్పుగానీ ఓ వందసార్లు చేశాడంటే—అన్నిసార్లూ అన్ని రకాలుగానూ చేశాడని చెప్పాలి. ఒకసారి చేసిన విధంగా మరోసారి చేయడం అతనికి నిజంగా చేత కాదు. సినిమా నిర్మాతలూ, రచయిత్రులూ కనకరాజు వద్ద నేర్చుకోవలసిన మరో విషయముంది. అదే అనుకరణలేని ప్రత్యేకత. అతను ఎవరినీ అనుకరించడు. అతను చేసిన విధంగా వంటకాలని ప్రపంచంలో ఇంత వరకూ ఎవరూ చేసి ఉండలేదు. కనకరాజు పులిహోర చేశాడంటే దాన్ని పులిహోర అనలేము. దాన్ని ''కనకరాజు పులిహోర'' అని పిలవ్వలిసిందే!

ఈ ప్రత్యేతకకు కారణం బహుశా—విశ్వామిత్రుడి అంశ అతనిలో ఉండడమే కారణమయుంటుంది. విశ్వామిత్రుడు సృష్టికి ప్రతి సృష్టి చేసినట్లే-కనకరాజు వంటకు ప్రతివంటను సృష్టించబూనాడు.

లేబొరేటరీలో సైంటిస్టుగా తీసుకునుంటే కనకరాజీ పాటికి వంటలో ఓ వెయ్యి పేటెంట్లైనా తీసుకుని ఉండేవాడు. ఆ పేటెంట్లు అమెరికన్లు కొనుక్కుని ఆ ప్రకారం వంటలు తయారు చేయించి-నార్తువియత్నాంలో బాంబింగుకు బదులు వాడి ఉండేవారు. అయినా ఈ దేశంలో ''టాలెంట్'' ఉన్నవాళ్ళకి ఆదరణ ఉంటే- హర్‌గోవింద్‌కొరానా అమెరికా ఎందుకు వెళ్ళిపోతాడు?

ఐంద్రజాలికుడు సర్కార్ గురించి మనం చాలాసార్లు విని వుంటాం. కానీ ఆయన చేసేదల్లా తన తెలివితేటల్నుపయోగించి మనకు భ్రమ కలిగించడం మాత్రమే! ఈ విషయం స్ఫురించినప్పుడల్లా-కనకరాజు శక్తి అద్భుతమనిపిస్తుంది.

అతను సభ్యులందరూ చూస్తూండగానే ఒకోసారి బంగాళాదుంపల కూర చేసేవాడు. కానీ అదేమి చిత్రమో-అది అచ్చం బీరకాయ కూరలాగుండేది తినడానికి. ఇందులో కనకరాజు కల్పించిన భ్రమ ఏమీలేదు. అది అతని చేతులకు వరప్రసాదమైన అద్భుతశక్తి. ఇది నిజంగా స్టేజిమీద ప్రదర్శన ఇస్తే అతని పేరు దిగంతాలవరకూ వ్యాపించి ఉండేది.

ఒక్క కూరల్లోనేకాదు. అతను కాచిన పాలకు కూడా ఓ విధమైన మార్పు వస్తుందేమోనని ఇది జరిగేక అనిపించింది సభ్యు

లందరికీ. మెస్సు మెంబర్లలో ఒకడైన ప్రకాశం ఓ రోజు సుబ్రహ్మణ్యం అన్న స్నేహితునింటికి వెళ్ళాడు. సుబ్రహ్మణ్యానికి ఓ పెంపుడు పిల్లి ఉంది. ఆ పిల్లని తీసుకుని అతనోరోజు సరదాగా ప్రకాశంతోపాటు మెస్సుకి వచ్చాడు. ఆ పిల్ల చాలా అందంగా ఉంది.

కనకరాజు ఆ పిల్లిని చూసి సంబరపడి —"చాలా బాగుంది కదండీ!" అని మళ్ళీ దాని వంక చూసి—"సాసర్లో పోసి కాసిని పాలు తీసుకొస్తాను—తాగుతుందేమో?" అన్నాడు. "సరేసర్రా-" అన్నాడు ప్రకాశం.

కనకరాజు ఓ సాసర్లో పాలు పోసి నేల మీద పెట్టి—పిల్లిని పిలిచాడు. "మ్యావ్—" అంటూ ఆ పిల్లి సుబ్రహ్మణ్యం ఒళ్ళోంచి ఉరికి—సాసరు దగ్గరికెళ్ళి మూతి పాలలో ముంచి కొద్దిగా తాగింది. ఏమయిందో ఏమో హఠాత్తుగా పాలు తాగడం మానేసి భయంగా అందరి వంకా చూసి అక్కణ్ణుంచి పరుగెత్తింది. సుబ్రహ్మణ్యం పిలిచినా వెనక్కి రాలేదు. "కుక్కలు పీకుతాయేమో" నంటూ దానివెనకే పరుగెత్తి కెళ్ళి పోయాడు సుబ్రహ్మణ్యం.

మర్నాడు ప్రకాశం మోసుకొచ్చిన వార్త ఏమిటంటే—"ఆ పిల్లి—పాలు తాగడం మానేసిందిట—"

కేవలం తన మాహాత్మ్యాన్ని ప్రదర్శించడం కోసమే కనకరాజా పిల్లికి పాలు పట్టి ఉంటాడని రాజారావు కనుమానం వచ్చింది. కనకరాజుకి తన ప్రతిభను గురించి తెలిసే ఉంటుందని రాజారావు నమ్మకం. ఎందుకంటే కనకరాజు కాలనీలో చాలామందికి పాలు పోస్తున్నప్పటికీ ఆ పాలెన్నడూ అతను తాకలేదు. ఓ కుర్రాడి చేత పాలుపితికించి అందరిళ్ళకూ పంపేస్తూండే వాడు. అతను తనచేత్తో ఇంత గడ్డి కూడా ఎన్నడూ ఆవులకి వేయలేదు.

ఆ పిల్లి పాలు మానేసి నప్పట్నించీ కనకరాజు మెస్సు మెంబర్సులో చాలా మందికి కలవరం కలిగింది. ఆ పాలే తాగుతూ తాము కూడా మానేయాలని అనుకుంటూ కూడా మానలేక పోతున్నారు. ఏమిటి తాము చేసుకున్న పాపం? కనకరాజుని ఎన్ని తిట్టినా - అతని వంట బాగుపడదు సరిగదా-కోపమొచ్చి అతను వెళ్ళిపోతే మళ్ళీ వంటవాడు దొరకడమే కష్టమయిపోతుంది. ఓ రోజు అందరూ ఈ విషయమై అత్యవసర సమావేశం జరిపి-"ఏమైనా సరే మరికొంత కాలంపాటు ఈ మెస్సు భోజనం తప్పద"ని నిర్ణయించారు. అంతకంటే వారేం చేయగలరు? అందరూ కూడా శాపగ్రస్తులు.

అయితే ఇది జరిగిన వారంరోజులకే ఓ వింత జరిగింది. దాంతో కనకరాజు మెస్సులో ఉండడంవల్ల ప్రయోజనమంటూ కనిపించింది.

మెస్సు మెంబర్సులో ఒకడయిన నారాయణను పాము కరిచింది. నారాయణను వెంటనే డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళడమూ, ఆ పామును వెంటనే చంపివేయడమూ కూడా జరిగాయి. అది ఒకటోరకపు గోధుమ వన్నె త్రాచు. నారాయణ బ్రతుకుతాడన్న ఆశ ఎవరికీ లేదు.

కానీ చిత్రంగా నారాయణ బ్రతికాడు. డాక్టర్ చెప్పిన మాటల ప్రకారం అతని శరీరంలోకి అసలు విషం ఎక్కలేదు. "పాము సరిగ్గా కరవలేదో-లేక నీ శరీరంలో మంచి విష నిరోధక శక్తి ఉందో కానీ-నువ్వు చాలా అదృష్టవంతుడివి-" అన్నాడాయన నారాయణతో.

వెంటనే మెంబర్సందరికీ పాములంటే భయం పోయింది. కనకరాజు భోజనం విషతుల్యం. ఆ భోజనం రోజూ తినడంవల్ల శరీరం విషానికి బాగా అలవాటు పడిపోయింది. ఇంక ఏ విషమూ తమనేం చేయలేదనే ధైర్యం వారికి వచ్చింది.

రాజారావుకు శాపవిముక్తి:

జీవితమంటే పాములకు భయపడక పోవడమే అయినట్లయితే రాజారావుకి కనకరాజు మెస్సులో ఇంకా ఉండడానికి అభ్యంతరం లేకపోయేది. కానీ రానురానూ అతనికి జీవితమంటే విరక్తి కలగసాగింది. తను ఏ తప్పు చేసినందుకు ఈ శిక్ష విధించ బడిందా? అని ఆలోచించ సాగాడు. ఎంతకూ గుర్తుకు రాక పోయేసరికి-అతను ఆ సంవత్సరానిదీ, క్రితం సంవత్సరానిదీ డైరీలు తిరగవేయ సాగాడు. అలా తిరగేస్తూండగా ఓ విశేషం కనిపించింది. సరిగ్గా ఆరు నెలల క్రితం-వసుంధర తన్ను శపించింది.

స్నేహితులతో సరదాగా మాట్లాడుతూ తన్ను శాపగ్రస్తుడిగా అభివర్ణించుకున్న రాజారావుకి తను నిజంగానే శాపగ్రస్తుడనే విషయం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆనాటి తన ప్రవర్తన తలచుకుని అతను సిగ్గుతో కుంచించుకుపోయి, పశ్చాత్తాపంతో దహించుకుపోయాడు. ఆనాడు వసుంధరను బాధించి మర్నాడే అతను క్షమార్పణలు చెప్పుకున్నాడుగానీ - అసలైన పశ్చాత్తాపం మాత్రం అతని కీరోజే కలిగింది. అయితే తనకు శాపవిమోచనామార్గం వసుంధరే చూపించాలన్నమాట!

తను ఇలా శాపం అనుభవిస్తున్నట్లు ఆమెకు కూడా తెలిసిఉండదు. ఆమె ఇచ్చిన శాపఫలితం ఆమెకు తెలియకపోతే - విమోచన మార్గం చూపించలేదు గదా! అందుకని అతను చాలాసేపు ఆలోచించి ఓ పథకం వేశాడు.

మర్నాడే అతను ఫొటో స్టుడియోకు వెళ్ళి ఓ ఫొటో తీయించుకున్నాడు. రెండురోజుల్లో ఆ ఫొటో వచ్చింది. ఒక తెల్ల కాగితంమీద ఆ ఫోటోని అంటించి దానికి ఎడమప్రక్కగా-తను భువనేశ్వర్ వచ్చే ముందు తీయించుకున్న ఫొటో అంటించాడు. కనకరాజు మెస్సులో భోజనానికి ముందు అని పాత ఫొటో కిందా, తరువాత అని కొత్త ఫోటో కిందా రాశాడు. ఆ రెండు ఫోటోల కిందా ఉత్తరం మొదలు పెట్టాడు- ఆ ఉత్తరంలో వసుంధర తన్ను శపించిన ప్రకారం వివరించి ఆ శాపాన్ని తను ఏ విధంగా అనుభవించిందీ తెలియబరుస్తూ ఇలా ముగించాడు.

"నీ మనస్సుని ఆ నాడు ఎంతో క్షోభ పెట్టాను-అందుకు ఫలితం అనుభవిస్తున్నాను




అయిదు నెలలుగా. దయుంచి ఇకనైనా శాప విమోచన మార్గం తెలుపవా, వసూ!

ఇట్లు,
శాపగ్రస్తుడు, నీ భర్త.

కళ్ళనీళ్ళతో ఆ ఉత్తరం చదువుకున్న వసుంధర- "ఎంత అన్యాయంగా మారిపోయారండీ-" అంటూ కొత్త ఫొటోలోని రాజారావుని చూసి విలపించింది.

"ఎంత పాపిష్టిదాన్ని-" అనుకున్న వసుంధర ముఖం అంతలోనే కోపంగా అయిపోయింది- "ఏదో కోపంలో భర్త కేదో అన్నంతమాత్రాన, నా వాక్కుకి భగవంతుడింత శక్తి నిచ్చి-నిజం చేయాలా? నిజంగా నా వాక్కుకి శక్తి ఉంటే-ఆయన కేదో ఒక క్వార్టరు దొరకాలి. దొరక్కపోతే దేవుడి పని చెబుతాను-" అనుకుంది కసిగా.

* * *

"అమ్మయ్యో - మీ ఆయన్ని శపిస్తుందేమో-" అన్నారు లక్ష్మి, పార్వతి ఒకేసారిగా. దేవుడంటే విష్ణువేననీ లక్ష్మికీ, శివుడేనని పార్వతికీ నమ్మకం.

"ఆహా-అందులో ఏం సందేహం లేదు- మీ రిద్దరూ కలిస్తే అందుకేదైనా జాగ్రత్త తీసుకోవడం మంచిది-" అన్నాడు నారదుడు.

పతివ్రతలంటే ఎంతో భయముండడంవల్ల తమ పాత వైరాలను మరచి-లక్ష్మి, పార్వతి కూడ బలుక్కున్నారు- "సరే-అలా చేద్దాం!" అనుకున్నారు.

* * *

"చాలా ఆశ్చర్యంగా ఉందోయ్-ఇన్నాళ్ళు అనవసరమని అంటున్న డైరెక్టరు ఈ రోజు పొద్దున్నే పిలిచి నన్ను ట్రయినింగుకి వెళ్ళమన్నాడు-పదో తారీఖున బయల్దేరాలి. ట్రయినింగు మూడు నెలలుంటుంది కాబట్టి ఈ మూడు నెలలూ నీ ఫామిలీని తెచ్చుకోవచ్చేమో" అన్నాడు రమేష్ పూరి.

రమేష్‌పూరి బ్రహ్మచారి పంజాబీవాడు. అతను పంజాబీ మెస్సులోభోంచేస్తూండేవాడు. రమేష్ పూరి, రాజారావు ఉంటున్న ఆ హాస్టల్ సూట్ ఫామిలీ ఉండడానికి బాగానే ఉంటుంది. రెండు గదులు, బాత్‌రూమ్, వరండా ఉంటాయి.

రాజారావు ఆశ్చర్యానికి అంతు లేదు. వెంటనే అతను భార్య కుత్తరం రాసేశాడు. పదవతేదీ తర్వాత మంచి ముహూర్తం చూసుకుని బయల్దేరి రమ్మని.

అతని ఆశ్చర్యాన్ని రెట్టింపు చేస్తూ- మర్నాడే అతనికో ఉత్తరం వచ్చింది భార్య దగ్గర్నుంచి. "నేను మిమ్మల్ని కావాలని శపించలేదు. నా శాపమే నిజమైతే ఈ రోజే మీకు విమోచన లభిస్తుంది-" అని రాసిందామె.

"ఆహా-నా జన్మ ధన్యం-నే నొక పతివ్రత భర్తను-" అనుకున్నాడు రాజారావు.

కనకరాజు అవతార సమాప్తి :

వసుంధర రావడంతోనే రాజారావుకి కనకరాజు భోజనం తప్పింది. అతని కిప్పుడు వసుంధర వండిన వంట అమృతప్రాయంగా ఉంటోంది. భర్త పదేపదే తన వంటను మెచ్చుకోవడం చూసిన వసుంధర- "కనకరాజూ-నీకు స్త్రీ లోకమంతా ఋణపడి ఉంటుందయ్యా!" అనుకుంది.

కనకరాజు మెస్సులోంచి రాజారావు తప్పుకున్నాక ఓ నలుగురు మెంబర్లు స్వంత వంట మొదలు పెట్టారు. మరో ఇద్దరు పెళ్ళిచేసేసుకుని-ప్రత్యేక హాస్టల్ సూట్స్ ఉండడంవల్ల-భార్యలను తెచ్చేసుకున్నారు. ఇంకో ఇద్దరు స్కూటర్ కొనుక్కుని రోజూ టౌన్‌లో హోటలుకు వెళ్ళి భోంచేయడం మొదలు పెట్టారు. ఇంక ముగ్గురే మిగిలారు.

మెంబర్సు తగ్గిపోవడంతో కనకరాజులో ఏదో మార్పు రావడం మొదలయింది. అతని కిదివరకు చిరాకన్నది ఉండేదికాదు. అటువంటి దిప్పుడు ప్రతి దానికీ విసుక్కోవడమూ, చిరాకుపడడమూ-అప్పుడప్పుడు కేకలేయడమూకూడా మొదలు పెట్టాడు. ఒకరోజు వంట చేయడం మానేసి-ఏమని అడిగితే ఒంట్లో బాగా లేదన్నాడు నిర్లక్ష్యంగా. మరో రోజున గారెల్లో ఉప్పెక్కువ వేశాడని మెంబర్సు విసుక్కుంటున్నారు.

"ఎందుకండీ విసుక్కుంటారు - అందుకనేగా సాంబార్లో ఉప్పు తగ్గించాను-" అన్నాడు కనకరాజు సీరియస్‌గా.

ఆఖరికి ఒకతనికి విసుగేసినట్లుంది— "ఏమయ్యా—ఉంటే తిన్నగా ఉండు—లేకపోతే నీ ఊరుపో. అంతేగానీ ఇలా మమ్మల్ని వేధించకు-" అన్నాడు.

అందుకోసమే ఎదురు చూస్తున్నట్లుగా అన్నాడు కనకరాజు-"ఈవెధ వ్వాళ్ళో నేనిక ఉండలేనండీ-మీరేమీ అనుకోవద్దు-రేపే నేను వెళ్ళిపోతున్నాను-"

అంతా తెల్లబోయారు.

కనకరాజు అన్నంతపనీ చేశాడు. అతను వెంటనే ఆవుల్ని అయిన కాడికి అమ్మేశాడు. కానీ-వెళ్ళిపోయే ముందు పాత మెస్సు మెంబర్లందరినీ, వాళ్ళ చుట్టాలతో సహా పిలిచి విందు చేయాలనుందని—అన్నాడతను. ఆ ప్రకారమే అతను అందర్నీ ఆ రాత్రి విందుకి ఆహ్వానించాడు.

మెంబర్సందరూ హడిలిపోయాడు. మొసళ్ళున్న నదిలోంచి ఈతలుకొట్టి ప్రాణాలతో బయటపడ్డాక మళ్ళీ అదే నదిలోకి ఈతకు ఆహ్వాన మొచ్చినట్లనిపించింది అందరకూ. కనకరాజు జాలిముఖం చూసి ఎవరూ కాదన లేకపోయారుగానీ ఎవరికీ వెళ్లాలనిలేదు!

రాత్రి ఎనిమిది గంటలకు విందయితే రాజారావు ఏడింటికే ముసుగు దన్ని—"నాకు జ్వరమొచ్చిందని చెప్పు-" అన్నాడు భార్యతో. కానీ వసుంధర అంగీకరించలేదు. "ఓసారి-అతని భోజనం రుచి చూడాలని ఉంది-" అందామె. "నీ కర్మ! భర్తను శపించిన పాపానికి-అమాత్రం అనుభవించాలే మోలే-" అని విసుక్కుంటూనే రాజారావామెను విందుకి తీసుకెళ్ళాడు. చిత్రమేమిటంటే ఆ రోజు విందుకు ఒక్కరు కూడా మానలేదు. మొత్తం ముప్పైమంది పోగడ్డారు.

అయితే ఆరోజు ప్రపంచమంతా ముక్కుమీద వేలేసుకోవలసిన వింత జరిగింది. చంద్రమండలంమీద మానవులు అడుగెట్టినపుడు కూడా ఆశ్చర్యపోని చంద్రశేఖరం కూడా ఆశ్చర్యపడ్డాడు.

కనకరాజు వంట అద్భుతంగా చేశాడు. ఎన్నడూ ఎవ్వరూ తినీవినీ ఎరుగనంత రుచిగా చేశాడు. మెంబర్లందరూ తమ భార్యలవద్ద, చుట్టాలవద్ద సిగ్గుతో తలెత్తుకోలేనంత రుచిగా చేశాడు. వాళ్ళంతా మెంబర్ల కేసి అసహ్యంగా చూశారు- "ఈ భోజనాన్నా-మీరు ఇదివరకు అసహ్యించుకున్నది-" అన్నట్లుగా.

అదే చూపు వసుంధర కూడా రాజారావు మీదకు ప్రసరించింది.

రాజారావు మెదడు చురుగ్గా పనిచేసింది.

"చూడు వసూ! కృష్ణావతారం ముగిసే ముందు గోపికలందర్నీ దొంగలు తరలించుకుపోతూంటే అర్జునుడి బాణాలెందుకూ పనికి రాలేదుట. అనగా అర్జునుడి శక్తి నశించిందన్న మాట. అలాగే పరశురాముడు రాముడిముందు నిర్వీర్యుడై పోయాడు. కనకరాజు కేసు అంతే—అతనిలో దైవాంశ నశించింది. ఇంక అతను మామూలు మనిషి. మీచేత శాపం అనుభవింపజేయడానికి ప్రత్యేక శక్తులతోవచ్చాడు. శాపం అయిపోయింది. కనకరాజు పనీ అయిపోయింది. తన శక్తుల్ని కోల్పోయిన కనకరాజు కిక్కడుండడం ఇంక ఇష్టంలేదు—అందుకే వెళ్ళిపోతున్నాడు-" అన్నాడతను.

ఆ విధంగా కనకరాజు తన అవతారాన్ని చాలించి మర్నాడే స్వగ్రామానికి వెళ్ళిపోయాడు.

**ఉపసంహారము:**

లక్ష్మీదేవి ఓసారి బాధగా నిట్టూర్చి యిలా అంది: "భూలోకంలో పతివ్రతలున్నారు—వాళ్ళకు ప్రభావమూ ఉంది. కానీ ఆ సంగతి వాళ్ళకు తెలియదు. భూలోకం పరిస్థితి చూస్తూంటే—స్త్రీల సమయం చాలావరకూ చదువుతోనే గడిచిపోతూన్నట్లుంది. వంట నేర్చుకోవడం వాళ్ళకు కుదరడం లేదు. ఆ పరిస్థితుల్లో వాళ్ళు వంటబాగా చేయకపోవడమూ, భర్తలచేత చీవాట్లు తినడమూ జరుగుతుంది. ఒకొక్కప్పుడు ఇది మనస్పర్థలకూ, తీవ్ర భేదాభిప్రాయాలకూ కూడా దారితీయవచ్చు — కనకరాజు అవతారం చాలించేయకుండా ఉంటే బాగుంటుంది."

నారదుడు వెంటనే అన్నాడు: "అవతారం చాలిస్తే ఏమమ్మా—వినాయకుడూ మొదలైన వాళ్ళనిలాగే ఈ కనకరాజునీ తమ కోరికలు తీర్చమని ప్రార్థించుకుంటారూ—"

"చాలా బాగుంది నారదా—అయితే వ్రతవిధానమంటూ ఏర్పరిస్తే బాగుంటుంగి కదా?" అంది పార్వతి.

"దానికేముంది — ఈ కథను భూలోకంలోని పత్రికలలో వేయించడమూ, ఆ కథకు చిత్రకారుడు వేసిన బొమ్మను కనకరాజు పటంగా భావించుకోవడమూ—ఆ బొమ్మకు పసుపురాసి ఓ పీట మీద పెట్టి-దాని కెదురుగా పద్మాసనం వేసుకుని కూర్చుని, ఈ కథా పారాయణం చేయడమూ — పారాయణం పూర్తయాక మాడినపప్పు, ఉడకని గారె, కారంవేసిన పరవాణ్ణం—నైవేద్యం పెట్టడమూను. ఇదే వ్రతం. ఈ వ్రతం అవగానే ఏదో పని కల్పించుకుని పుట్టింటికి వెళ్ళిపోవాలి. పుట్టిళ్ళు లేనివాళ్ళు అనారోగ్యాన్ని నటించాలి. ఫలితంగా వారి వారి భర్తలకు బయట భోజనశాలల్లో భోంచేయవలసిన అగత్యం పడుతుంది. ఆ భోజనశాల వంటవాడిని కనకరాజు ఆవహించి—తన ప్రత్యేకతతో వంటకాలు తయారు చేయిస్తాడు - తర్వాతేముంది-భామా విజయం!" అంది సరస్వతి.

"బాగు బాగు" అంది మహిళామండలి అంతా ఏకగ్రీవంగా.

"నారదా! నువ్వే ఈ వ్రతాన్ని గురించి భూలోక వాసులకు తెలియజేయాలి—" అంది లక్ష్మీదేవి.

"సరే తల్లీ—కానీ ఈ వ్రతంచేస్తే పురుషుల కక్కడా ఏదైనా ప్రయోజనముండేటట్లు చూడండి-అనగా ఈ వ్రతం చేసిన పురుషులకు కనకరాజు వండేలాంటి భోజనం తప్పుతుందంటే—వ్రతానికి మంచి పలుకుబడి కూడా వస్తుందేమో—"

"తథాస్తు........" అన్నారు లక్ష్మి, పార్వతి, సరస్వతి.

"మరి వస్తానమ్మా?"

"సరే-భూలోకవాసులకు ఎలా తెలియజేద్దామనుకుంటున్నావు?" అంది పార్వతి.

"అవన్నీ నేను చూసుకుంటాగా!"

* *

ఆ రాత్రి వసుంధరకు కలలో నారదుడు కనిపించాడు.